క్లుప్తంగా

మంత్రి కాకాణి పరామర్శ

వెంకటాచలం: మండలంలోని ఇస్కపాళెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పెళ్లూరు సుధాకర్‌రెడ్డి సోదరుడు పెళ్లూరు విజయసేనారెడ్డి (83) అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం ఇస్కపాళెం చేరుకుని విజయసేనారెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట డీసీసీబీ మాజీ చైర్మన్ వేమారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి తదితరులున్నారు.

గడప గడపకు కార్యక్రమంపై సమీక్ష నేడు

తోటపల్లిగూడూరు: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించి బుధవారం నరుకూరులో సమీక్ష జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్ తెలిపారు. సచివాలయాల కమిటీ మండల కన్వీనర్ తలమంచి సురేంద్రబాబుతో కలిసి ఆయన మంగళవారం నరుకూరు రిషీ గ్రాండ్ కల్యాణ మండపంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలకిచ్చిన హామీలను సంపూర్ణంగా నెరవేర్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మండలంలో విజయవంతంగా ముగిసిందన్నారు. సాంకేతిక కారణాలతో పథకాలు అందని వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఆయా సమస్యలకు అధికారులు ఏ మేరకు పరిష్కారం చూపారో తెలుసుకునేందుకు బుధవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమీక్ష నిర్వహిస్తారన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో సంగమేశ్వరుడు

మనుబోలు: మండలంలోని బద్దెవోలు రోడ్డ పక్కన కండలేరు ఒడ్డున వెలసిన సంగమేశ్వరాలయంలో అధిక శ్రావణమాస పౌర్ణమి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఫణీంద్రశర్మ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేకాలంకరణ చేశారు. అనంతరం ఆలయం వద్ద అన్నదానం చేశారు.

ఆంజనేయస్వామికి..



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు: పట్టణంలోని మారుతీ నగర్ శ్రీవీర అభయాంజనేయ స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా రజక సేవా సంఘం వ్యవహరించింది. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.

విద్యార్థులకు ప్లేట్లు, నోట్‌బుక్స్ పంపిణీ



బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని శాంతినగర్‌లో ఉన్న ఎంపీపీ పాఠశాలలో సహారా ఎడ్యుకేషనల్ సొసైటీ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు భోజనం ప్లేట్లు, నోట్‌బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ సహారా ఎడ్యుకేషనల్ సంస్థ ప్రతి సంవత్సరం పిల్లలకు విద్యా ఉపకరణాలు అందజేసి అండగా నిలవడం అభినందనీయమన్నారు. ఇందుకు సహకరిస్తున్న దాతలైన శీనయ్య, నరసయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఎస్దానీ బాషా, హెచ్‌ఎం ప్రసాద్‌రావు, ఉపాధ్యాయులు ఇంతియాజ్ అహ్మద్, పద్మావతి, రాజ్యలక్ష్మి, సంస్థ సభ్యులు పఠాన్ రహంతుల్లాఖాన్ పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం: పల్లిపాళెంలో దివ్యాంగ బాలుడు చలంచెర్ల ఆనంద్‌కు పింఛన్ ఇస్తున్న వలంటీర్ సురేఖ



పొదలకూరు: ఎమ్మార్వో కాలనీలో పసుపులేటి వజ్రమ్మ వివరాలు నమోదు చేస్తున్న వలంటీర్ బాలాజీ

పింఛన్ ఇచ్చి.. అండగా నిలిచి..

వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ సొమ్ము తీసుకునేందుకు లబ్ధిదారులు అనేక ఇబ్బందులు పడ్డారు. రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పరిస్థితి లేదు. వలంటీర్లు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదు అందజేస్తున్నారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు సంతోషంగా ఉన్నారు. ఎవరైనా ఇతర ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుంటే వలంటీర్లు సొంత ఖర్చులు పెట్టుకుని వెళ్లి నగదు ఇచ్చి అండగా నిలిచిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. పొలం, ఇతర పనుల్లో ఉంటే వారి వద్దకెళ్లి పెన్షన్లు ఇస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



వెంకటాచలం: పింఛన్‌దారుడు సుబ్బారాయుడు వివరాలు తీసుకుంటున్న వలంటీర్ శ్రీనివాసులు



ఇందుకూరుపేట: మైపాడులో స్వామిదాస్‌కు నగదు అందజేస్తున్న వలంటీర్ లక్ష్మీప్రసన్న



కోవూరు: పడుగుపాడు సచివాలయం-2 పరిధిలో వృద్ధురాలి చేత వేలిముద్ర వేయిస్తున్న వలంటీర్ సురేఖ

రోడ్ల నిర్మాణానికి రూ.5.75 కోట్లు విడుదల

- మంత్రి కాకాణి చొరవ
- త్వరలో పనులు ప్రారంభం

పొదలకూరు: పట్టణంలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవ తీసుకుని పట్టణంతోపాటు ఇనుకుర్తి (గేట్ సెంటర్ తర్వాత తారురోడ్డు) వరకు రోడ్డు నిర్మాణానికి రూ.5.75 కోట్లు విడుదల చేయించారు. ఇందుకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయి త్వరలో పనులు కూడా ప్రారంభించనున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టణంలో సీసీ రోడ్డు నిర్మాణానికి సంబంధించి కొలతలు కూడా తీసుకున్నారు. గతంలో నిర్మించిన సిమెంట్ రోడ్డు కుంగిపోయి అక్కడక్కడా వర్షపు నీరు నిలబడుతోంది. స్థానిక బస్టాండ్ ప్రవేశం నుంచి గేట్ సెంటర్ వరకు 530 మీటర్ల నిడివితో సీసీ రోడ్డును నిర్మిస్తామని ఆర్‌అండ్‌బీ డీఈ సురేఖ వెల్లడించారు. గతంలో మంత్రి కాకాణి జెడ్పీచైర్మన్‌గా పనిచేసిన సమయంలో మండలంలో గ్రామీణ రోడ్లకు నిధులు విడుదల చేయించారు. కాగా ప్రస్తుతం వర్షాకాలంలో రోడ్లు దెబ్బతింటే తాత్కాలిక మరమ్మతుల కింద కూడా నిధులు మంజూరు చేయించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. రాపూరు మార్గంలో ఇనుకుర్తి వద్ద వర్షాలకు రోడ్డు పూర్తిగా దెబ్బతింటే శాశ్వత ప్రాతిపదికన సిమెంట్ రోడ్డును నిర్మించారు. ఇంకా ఎన్నో ఏళ్లుగా నిర్మాణానికి నోచుకోని మొగళ్లూరు రోడ్డుకు మహర్దశ పట్టింది. శరవేగంగా మార్కెట్ నిధులతో సిమెంట్ రోడ్డు పనులు జరుగుతున్నాయి.



పొదలకూరు పాత సిమెంట్ రోడ్డు

ఫ్లెక్సీలు చింపిన వారికి సన్మానం చేయాలా?



మాట్లాడుతున్న శంకరయ్య గౌడ్, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

తోటపల్లిగూడూరు: అధికార కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చింపిన వారిని శిక్షించకుండా సన్మానాలు చేయాలా? అని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్ టీడీపీ నాయకులను ప్రశ్నించారు. ఆయన మంగళవారం నరుకూరు రిషీ గ్రాండ్ కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సౌత్ఆములూరు గ్రామంలో ఏర్పాటు చేసిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఫ్లెక్సీని ఆదివారం అర్ధరాత్రి టీడీపీ సానుభూతిపరుడైన మల్లికార్జున్ మరో ఇద్దరితో కలిసి చింపి వేసినట్లు చెప్పారు. దీనిపై ఫిర్యాదు అందడంతో పోలీసులు నిందితులను స్టేషన్‌కు తరలించి విచారించి పంపేశారన్నారు. అయితే టీడీపీ నేతలు పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించి ఎస్సై, వైఎస్సార్‌సీపీ నేతలను దూషించడం విచారకరమన్నారు. ఫ్లెక్సీలను చింపిన వారికి వత్తాసు పలకడం టీడీపీ నేతల దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి తలమంచి సురేంద్రబాబు మాట్లాడుతూ సౌత్ఆములూరులో మంత్రి కాకాణి ఫ్లెక్సీని టీడీపీ నాయకులు చింపుతుండడం సీసీ కెమెరాలో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. మంత్రి కాకాణిపై ఆరోపణలు చేయడం దారుణమన్నారు. గ్రామాల్లో గొడవలు సృష్టించి ఆనందించే వ్యక్తిత్వం మంత్రిది కాదన్నారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు చెరుకూరు శ్రీనివాసులునాయుడు, నాయకులు ఆకుల మధు, నరసింహప్రసాద్, వేముల శ్రీనివాసులు, రంగినేని కిరణ్, రంగినేని కిశోర్, ఉడా కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

పాల దిగుబడి పెంచడమే లక్ష్యం

మనుబోలు: రైతులకు తక్కువ ధరకే పశువుల దాణాను సరఫరా చేయడం ద్వారా పాల దిగుబడిని పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అమూల్ ప్రతినిధి కామరాజ్ ఆర్ చౌదరి తెలిపారు. ఆయన మంగళవారం తమ కంపెనీ ప్రతినిధులతో కలిసి మండలంలోని వెంకన్నపాళెం పరిధిలో రైతులు సాగు చేస్తున్న జొన్నగడ్డిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ గడ్డిని పశువులకు మేతగా వేయడం వల్ల పాల దిగుబడి పెరుగుతుందన్నారు. గుజరాత్‌కు చెందిన కంపెనీ విత్తనాలను రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తోందన్నారు. గడ్డిని అమూల్ కంపెనీ కొనుగోలు చేసి పాడి రైతులకు తక్కువ ధరకే ఇస్తోందన్నారు. వెంకన్నపాళెంలో సుమారు 120 ఎకరాల్లో గడ్డిని సాగు చేస్తున్నట్లు తెలిపారు.



జొన్నగడ్డి పొలంలో కంపెనీ ప్రతినిధులు

కార్యక్రమంలో అమూల్ డైరెక్టర్ భరత్ పటేల్, శ్రీకాంత్ పటేల్, గ్రీన్ ఇంక్ కంపెనీ ఎండీ శివ అభిరామిరెడ్డి, జీఎం శ్రీకాంత్‌రెడ్డి, ఏఓ చెంచురెడ్డి, అడపాల శివకుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వేగంగా భూముల రీ సర్వే

- ఆర్డీఓ శీనానాయక్

కొడవలూరు: భూముల రీ సర్వే వేగవంతం చేసి వంద శాతం పూర్తి చేయాలని కావలి ఆర్డీఓ శీనానాయక్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి మంగళవారం ఆయన విచ్చేసి రికార్డులను పరిశీలించారు. మండలంలో ఇంకా నాలుగు రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే చేయాల్సి ఉందని, దీనిపై దృష్టి పెట్టాలన్నారు. సర్వేలో తప్పులు తడకలు దొర్లితే సంబంధిత అధికారులపై కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం యల్లాయపాళెం 1, 2 సచివాలయాలకు వెళ్లి సిబ్బందితో మాట్లాడారు. ప్రభుత్వ సేవలను పక్కాగా అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఈ.రమాదేవి, డీటీ గున్నం మల్లికార్జున, సర్వేయర్ మహబూబ్‌బాషా, వీఆర్వోలు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ

బిడ్డకు తల్లిపాలే శ్రీరామరక్ష

కొడవలూరు: బిడ్డకు తల్లిపాలే శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని తాటాకులదిన్నెలో బాలింతలు, గర్భిణులు, తల్లులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు ముర్రుపాలు తాగించడం ద్వారా వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. బిడ్డలు ఆరోగ్యకరంగా పెరగాలంటే తల్లిపాలు విధిగా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మారంరెడ్డి రంగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి దామోదర్, మహిళా పోలీస్ బాదుల్లాబి, అంగన్‌వాడీ కార్యకర్త అరుణ పాల్గొన్నారు.

- రేగడిచెలికలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలు, తల్లులకు మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీధర్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.
- **మనుబోలు:** మండలంలోని పిడూరు ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ రమణమ్మ మాట్లాడుతూ కనీసం సంవత్సరం పాటైనా బిడ్డకు తల్లిపాలు పట్టించాలన్నారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో శీనమ్మ, మహిళా పోలీస్ పవిత్ర, అంగన్‌వాడీలు కృష్ణవేణి, విజయమ్మ, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట: తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం



కొడవలూరు: అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ నాగభూషణమ్మ



మనుబోలు : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

- **ఇందుకూరుపేట:** మండలంలోని లేబూరులో మంగళవారం జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.శిరీష పాల్గొని మాట్లాడారు. తల్లిపాలల్లో రోగ నిరోధకశక్తి అధికంగా ఉంటుందన్నారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వెంకటలక్ష్మి, శ్రీదేవమ్మ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సేవలకు సలామ్..

- దర్గా ప్రాంగణంలో అడుగడుగునా పరిశుభ్రత
- అహర్నిశలూ శ్రమించిన నగరపాలక సంస్థ కార్మికులు
- మూడు షిఫ్టుల్లో 4,908 మంది పారిశుధ్య సిబ్బంది

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నగరంలోని బారాషహీద్ దర్గాలో నిర్వహిస్తున్న రొట్టెల పండగలో నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికుల కష్టానికి ప్రతి ఒక్కరూ సలామ్ కొట్టాల్సిందే. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి పరిశుభ్రతకు పెద్దపీట వేశారు. స్వచ్ఛభారత్ స్ఫూర్తితో పారిశుధ్య కార్మికులు అహర్నిశలూ శ్రమించి లక్షలాది మంది భక్తులకు ఏ చిన్నపాటి ఇబ్బంది లేకుండా స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడంలో భాగస్వాములయ్యారు.

విధి నిర్వహణలో 4,908 మంది కార్మికులు

పారిశుధ్య విభాగానికి ఇన్‌చార్జిగా మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ ఆధ్వర్యంలో దర్గా ప్రాంగణాన్ని ఏడు జోన్లుగా విభజించారు. 4,908 మంది పారిశుధ్య కార్మికులు మూడు షిఫ్టుల్లో పనిచేశారు. ఫలితంగా దర్గాలో ఏ రోడ్డు చూసినా పరిశుభ్రంగా కనిపించాయి. అదే విధంగా వందలాది మంది పార్కింగ్ స్థలాల్లో విధులు నిర్వర్తించారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేందుకు గానూ దర్గా ఆవరణలో 18 వాహనాలు పనిచేశాయి. మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచేందుకు గానూ వ్యర్థాలను సెప్టిక్ ట్యాంక్ వాహనాల ద్వారా తరలించారు. స్నానపు గదులు, సామూహిక మరుగుదొడ్లు, ఘాట్, తదితర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా కార్మికులు చురుగ్గా పనిచేశారు.

అధికారుల ప్రత్యేక పర్యవేక్షణ

దర్గా పరిసరాలను కలెక్టర్ హరినారాయణన్, కమిషనర్ వికాస్ మర్మత్, జేసీ కూర్మనాథ్ నిరంతరం పరిశీలిస్తూ అధికారులకు దిశానిర్దేశనం చేశారు. భక్తులకు మెరుగైన సేవలను అందించేందుకు పబ్లిక్ హెల్త్ ఎస్ఈ సంపత్, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి నిర్మలాదేవి, జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత ఎంత కృషి చేశారు. టౌన్‌ప్లానింగ్ విభాగ ఆధ్వర్యంలో అన్ని రకాల సైన్ బోర్డులు, రూట్ మ్యాప్‌లను ఏర్పాటు చేయడంతో భక్తులు సులభంగా దర్గాలోకి చేరుకున్నారు. ఈ చర్యలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.

పక్కాగా ఏర్పాట్లు చేశాం

నెల్లూరు(బారకాసు): రొట్టెల పండగకు వచ్చిన భక్తులకు ఏర్పాట్లను పక్కాగా చేశామని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. దర్గా ప్రాంగణంలో ఏర్పాట్లను మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. భక్తుల షెల్టర్ కేంద్రాల్లో అన్ని వసతులను యథావిధిగా కొనసాగిస్తామని తెలిపారు. పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యమిచ్చామని పేర్కొన్నారు. మంచినీటి కేంద్రాల్లో నీటి పీపీఎమ్ నాణ్యతను ఎప్పటికప్పుడు తాను పరిశీలిస్తున్నానని తెలిపారు. దర్గా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హోటళ్లు, దుకాణాల్లో నాణ్యమైన ఉత్పత్తులనే విక్రయించాలని ఆదేశించారు.

పనుల పరిశీలన

బారాషహీద్ దర్గా ప్రాంగణంలో పారిశుధ్య పనులను జేసీ కూర్మనాథ్, కమిషనర్ వికాస్ మర్మత్ మంగళవారం రాత్రి పరిశీలించారు. అన్ని ప్రధాన ప్రాంతాల్లో బ్లీచింగ్‌ను చల్లుతూ.. దోమల నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. స్వర్ణాల తీరంలో ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. భక్తులకు ఏమైనా అసౌకర్యాలుంటే సంబంధిత జోన్‌లోని హెల్ప్ డెస్క్ దృష్టికి తీసుకురావాలని కోరారు.



పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

మాటిచ్చారు.. ఆదుకున్నారు

కోవూరు: ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సొంత నిధులతో ఇద్దరు వ్యక్తులకు పింఛన్లు అందజేశారు. పాటూరు గ్రామానికి చెందిన చింతగుంట గాయత్రి కాళ్లు, చేతులు చచ్చుబడిపోయాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రసన్న పర్యటించిన సమయంలో సమస్యను ఆమె ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లింది. పింఛన్ మంజూరయ్యే వరకూ ప్రతినెలా రూ.5 వేలు అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అలాగే కోవూరులోని పెళ్లకూరు కాలనీకి చెందిన పూసల చెంచమ్మ అనే వృద్ధురాలి చేతి వేలి ముద్రలు పడక పెన్షన్ అందడం లేదు. దీంతో ఆమెకు పింఛన్‌ను వచ్చే వారకు రూ.2,750 ఇస్తానని చెప్పారు. ఈ నేపథ్యంలో మంగళవారం నగదును నాయకుల ద్వారా లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ కవరగిరి ప్రసాద్, నాయకుడు పాలపర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలికి నగదు అందజేస్తున్న దృశ్యం

భర్త ఇంటి ఎదుట భార్య నిరసన

ఇందుకూరుపేట: భర్త ఇంటి ఎదుట భార్య నిరసన తెలిపిన ఘటన మండలంలోని మైపాడులో మంగళవారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. మైపాడుకు చెందిన ఎం.శ్రీధర్‌కు ఆత్మకూరుకు చెందిన అఖిలతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలం క్రితం వారి మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. దీనికి సంబంధించిన కేసు కోర్టులో ఉంది. కాగా భర్త ఇంట్లో ఉండేందుకు తనకు కోర్టు అనుమతి ఇచ్చిందని చెబుతూ అఖిల వెళ్లింది. అయితే శ్రీధర్ అడ్డుకుని ఇంటికి తాళం వేశాడు. తనకు న్యాయం చేయాలని కోరుతూ అఖిల భర్త ఇంటి ముందు నిరసన వ్యక్తం చేసింది. పోలీసులు వివరాలు తెలుసుకుంటున్నారు.

జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా నరేంద్ర

నెల్లూరు(బారకాసు): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్) ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా నరేంద్రను నియమిస్తూ ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. ఈ క్రమంలో బాధ్యతలను మంగళవారం ఆయన స్వీకరించారు. కాగా జీజీహెచ్ సూపరింటెండెంట్ సిద్ధానాయక్ వారం పాటు సెలవు పెట్టిన నేపథ్యంలో ఇన్‌చార్జిగా నరేంద్రను నియమించారు.

వివాహిత అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): వివాహిత అదృశ్యమైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న లక్ష్మయ్య భార్య లావణ్య గత నెల 13న ఇంటి నుంచి వెళ్లిపోయారు. ఆమె కోసం భర్తతో పాటు కుటుంబసభ్యులు గాలించినా ప్రయోజనం లభించలేదు. ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ హరిబాబు మంగళవారం తెలిపారు.